# బాబూ ధర్మం!

రచన:
శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు

'బాబూ-ధర్మం! అమ్మా-ధర్మం! పుణ్యం దక్కుతుంది మీకు. ధర్మం చెయ్యండయ్యా-అయ్యల్లారా! ధర్మం చెయ్యండమ్మా-అమ్మల్లారా! గుడ్డోడ్ని బాబూ! రెండుకళ్ళూ లేని అభాగ్యుణ్ణి! ఏ జన్మలో నో, నేను చేసుకొన్న పాపాలో, ఈజన్మలో ఇలా పుట్టి అనుభవిస్తున్నాను. బాబుల్లారా! అమ్మల్లారా! పుణ్యం చేసుకోండి!' అరుస్తున్నాడతను. కాదు అర్థిస్తున్నాడు.

అతని చేయిపట్టి, అతనికి వూతఇస్తూ అటూ ఇటూ నడిపిస్తున్నాడొక యువకుడు. 'బాబుల్లారా! అమ్మల్లారా! ఈ గుడ్డోడికి ధర్మంచేశి పుణ్యం కట్టుకోండి! 'నా' అన్న నాకు ఎవరూ లేని అభాగ్యుడు! ఈ దీనున్ని మీ పుణ్యంలో పవిత్రం చేయండి! ఆ అమ్మాయిగారు పావలా కాసు వేశారు. చక్కనివాడితో పెళ్ళి జరుగుతుంది లే!' అంటున్నాడా యువకుడు.

* * *

అధిక జనాభాకు ఆలవాలమైన ఈ దేశంలో అడుగడుగునా బిచ్చగాళ్ళు కన్పిస్తారు! ప్రతి ప్రదేశంలోనూ వారి కేకలు విన్పిస్తుంటాయి! ఇంతకీ ఈ ప్రదేశం ఎక్కడది? ఏ ఊరుకు దగ్గరలో వుంది? అన్న అనుమానం కలగక మానదు.

విజయనగర రాజులతో భీకరంగా పోరాడి, విశిష్ట చరిత్ర సృష్టించుకున్న, వీరబొబ్బిలిగా పేరు గాంచిన బొబ్బిలికి ఐదు మైళ్ళ దూరంలో, పార్వతీపురానికి వెళ్ళే మార్గంలో రహదారికి ప్రక్కన కన్పిస్తుందొక గుడిసె! అక్కడకు దగ్గరలో ఉన్న ఒక ఊరు కింతలవాని పేట! కాబట్టి ఆ గుడిసె ఆ ఊరుకి చెందిన వ్యక్తిదే అనుకోవచ్చు!

నాలుగు వెదురుకర్రలు వొంచి వాటిమీద పదిలోపు గడ్డికట్టలు ఉపయోగించి కట్టిందా గుడిసె! గాలికి ఎగిరిపోయేలా, వానకు లోపల వాళ్ళు తడిసిపోయేలా ఉండే ఆ గుడిసె 'జబ్బుతో మంచానపడి ఏ క్షణాన పోతాడో? అన్న మానవుని' గుర్తుకు తెస్తుంది! పది మంది దయతలచి కట్టింది కాబట్టి అలా ఉంది అని అంటారు కొందరు! ధర్మంతో చేసిన ప్రతి పనీ నాణ్యం లేనిది అనే భావం వచ్చేలా!

ఆ మార్గం గుండా అన్ని రకాల వాహనాలు వెళతాయి. అంటే రెండెడ్ల బండినుండి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థయొక్క బస్సులు వరకూ, సైనికులు మొదలు మోటారు సైకిలు వరకూ వెళతాయి!

ఆ గుడిసెలో ఉంటాడు ఒక ముసలి వ్యక్తి! పేరు వీరయ్యని అందరూ అంటారు! అతని రెండు కళ్ళూ లేవు! కాళ్ళున్నా, కళ్ళు లేక పోవడం వల్ల నడవలేడు! శబ్దం వినేందుకు చెవులున్నాయి, ధర్మం కోసం తన బిక్షా పాత్రను చాచేందుకు చేతులున్నాయి! వయసు డెబ్భైకి తగ్గదు.

ఆ గుడిసెలో కూర్చునే వీరయ్యతాత విన్పించిన ప్రతీ శబ్దానికి బయటకు వచ్చి ధర్మం కోసం అడుగుతాడు. అతడికి శబ్దాలు వినడం, వాటిని బట్టి అడగడం అలవాటయిన పని. బండి వస్తున్నట్లు అనుకోడానికి పశువుల మెడలో గుంటలు మ్రోగాలి! అలా మోత వినబడగానే— 'నాయుడూ! ధర్మం చెయ్! గుడ్డోడ్ని...' అంటాడు. దూరంగానైనా బెల్ మోగితే దానిని సైకిలుగా భావించి 'ఓ సైకిలు బాబూ! ధర్మం చెయ్!' అంటాడు. మోటారుసైకిలుకు

వేరే చెప్పక్కర్లేదు! దాని 'ధడ్...ధడ్' శబ్దాలే చాలు! అలా కాక అక్కడ ఆగవలసిన బస్సులు ఏవైనా వచ్చినట్లు అన్పించగానే బస్సు ముందుకు వెళ్ళి ధర్మం కోసం అడుగుతాడు. బస్సు రావడాన్ని 'క్లీనర్ కేక'ను బట్టి పోలుస్తాడు.

వీరయ్య కోసం ధర్మం చేసేందు కోసమే వాహనాలు ఆపేవారు కొందరు! బస్సు ఆపగానే 'బాబూ! ఈ గుడ్డోడికి ధర్మం చేయండి!' అని బస్సులో జనానికి చెప్పే క్లీనర్లు కొందరు! 'బాబూ! గుడ్డివాడికి ఏదైనా ధర్మం చెయ్యాలనుకుంటే ఇందులో వేయండి!' అని అంటూ తామే వసూలు చేసి యిచ్చే మంచి మంచి (వ్యక్తులు) బస్సు క్లీనర్లు మరికొందరు!

అలా దానం చేయబడ్డ చిల్లర డబ్బులని సాయంత్రం వేళ బస్సు దిగిన ఆ ఊరు వ్యక్తులు ఎవరైనా కనబడితే చెప్పి లెక్క బెట్టించుకుంటాడు. అందులోకూడ మోసాలు చేసేవారు ఉన్నారు! గుడ్డివాడు కదా! ఇందులో కొంత తీసినా చూస్తాడా! చస్తాడా! అని తస్కరించే వాళ్ళు కొందరు. 'ముష్టిలో ముష్టి వీరముష్టి!' అని సామెత! పగలల్లా గొంతు పగిలేలా అరుస్తూ, అలసి ఆపసోపాలు పడ్డ ఆ ముసలి వాడికి మోసం చేయ యత్నించిన ఆ నీచులను ఆ భగవంతుడుకూడ క్షమించడు!

* * *

సాయంత్రం వేళ ఊరి వారి సాయంతో ఊరులోకి వచ్చేస్తాడు! రాత్రికి కొన్ని ఇళ్లు తిరిగి 'మాధవ కవలం' సంపాయిస్తాడు. ఊరు మధ్యనున్న రామమందిరం మీద నిదురిస్తాడు!

సూర్యుడు ఉదయించే వేళకు లేచి రోడ్డు మీద గుడిసెకు వచ్చేస్తాడు. ఇలా అతడి కార్యక్రమంలో మార్పు లేకుండా జరుగుతుండేది! ఇదంతా ఎప్పుడు జరిగేది? ఆ యువకుడు రానప్పుడు; ఆ యువకుడు వీరయ్యతాత దగ్గర లేనప్పుడు,

* * *

ఒక రోజున వచ్చాడా యువకుడు. 'తాతా!' అని పిలిచాడు.





వి...

నమ్మకకు పాత్రమైన

బనియన్ల రకాలు

* అనిల్ ఫైన్ * అనిల్ కూల్ టెక్స్

* అరినో (కలర్) * బ్రీఫ్స్ & ట్రంక్స్

తయారించువారు:

Phone: 22411

**ANIL HOSIERY**

"SIDCO" Industrial Estate:

TIRUPUR - 638 602.

'ఎవరు బాబూ!' అడిగాడు వీరయ్య ఆశ్చర్యంగా, ఆప్యాయంగా. వీరయ్యతాత మాటను బట్టి అవతలి పిలిచిన వ్యక్తి రూపురేఖలు అంచనా వేసుకుంటున్నాడు!

ఆ యువకుడు 'తాతా! నీవు ఏమనుకోనంటే ఒక మాట! నాకు ఎవరూ లేరు! నీకూ ఎవరూ లేరని విన్నాను! నీకు ఇష్టమైతే నీకు తోడుగా ఉంటూ సాయ పడతాను' అన్నాడు.

వీరయ్యతాత ఆనందానికి అవధుల్లేక పోయింది, ఇన్నాళ్ళకు తనలాంటి మరోవ్యక్తి, తన కష్టాలకు జాలిపడే మరోవ్యక్తి, తన గురించి ఆలోచించే మరోవ్యక్తి వచ్చినందుకు సంతోష పడ్డాడు వీరయ్య. ఆ యువకుడి గురించి ఇంకేమీ అడుగలేదు.

'అలాగా బాబూ! నాకు మాత్రం అంతకంటే ఏం కావాలి? నా కోసం నీవు నాతో ఉంటానంటే కాదంటానా? నీవు నా సంపాదనతోనే తింటూ నాతోనే ఉండు! నిన్ను నా కొడుకులా చూసుకుంటాను' అన్నాడు వీరయ్య తాత!

అలా కలిసింది వారి బంధం! వీరయ్యతాతకు తోడుగా ఉండేవాడా యువకుడు. భిక్షాటనలో సాయ పడేవాడు. ఆ యువకుడే ఇద్దరికీ వంట చేసేవాడు. ఆ యువకుడ్ని నమ్మిన తాత తన కొచ్చే డబ్బులు అంతా అతడికే యిచ్చేవాడు. ఆ యువకుడు ఏ రోజు ఎంత వస్తుందో వీరయ్యతాతకు చెప్పేవాడు. వీరయ్యతాత ఆ యువకుడికి ఏం కావాలంటే అది కొనుక్కోమని చెప్పడంతో ఆ యువకుడు అతిగా కాకపోయినా అవసరానికి డబ్బు వాడేవాడు. ఆ యువకుడు పుష్టిగా, బలంగా తయారయ్యాడు.

అలా అయిదారేళ్ళు గడిచింది!

వీరయ్యతాత వల్ల వచ్చే డబ్బంతా ఒక సంచిలో వేస్తుండేవారు. సహజంగా వీరయ్యంటే ఆ ప్రాంతీయులకు జాలి ఎక్కువ! అంతేకాక వచ్చిన డబ్బు ఇతరుల మోసాల వల్ల పోవడం జరుగలేదు కనుక వేల స్థాయికి చేరుకుంది.

ఆ డబ్బును, కళ్ళు లేని వీరయ్యతాతను చూసిన ఆ యువకుడికి ఒక దుర్బుద్ధి పుట్టింది. ఒక రోజున సొమ్ముతో సహా ఎటో వెళ్ళి పోయాడు. తనను ఎంతగానో నమ్మించిన ఆ యువకుడు అలా వెళ్ళిపోవడంతో వీరయ్యతాతకు అనుకోని విధంగా వ్యాధి సోకింది. పైగా ముసలితనం!

ఏమి చేయాలో, ఎలా బ్రతకాలో తెలియని వీరయ్య కుమిలి కుమిలి ఏడ్చాడు! ఫలితంగా 'బాబూ ధర్మం' అని అందరికీ వినబడేలా అడిగే అవకాశం పోగొట్టుకున్నాడు!

పాపం! వీరయ్య తాతకు మాట పడిపోయింది, జ్యోతి ఆరిపోయింది.

---


# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం. 1938

విడి ప్రతి ... 75 పైసలు

సంవత్సర చందా ... రూ. 15-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హెగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలివీధి,

మదరాసు - 600 079.


Edited and Published by A. N. Raghavachar, No. 10, Murugesa Mudali St., Madras-600 079
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47, Badrian Street, Madras-600 001.